కుక్కలూ, ఆవుల్తోపాటుగా వీధుల్లో ఆహారం వెతుక్కునే కుర్రవాళ్ళు కనిపిస్తారు మామూలు దృశ్యమే అయినట్లు పట్టించుకోం మనం. పట్టించుకున్నా యే వొకరిద్దరూ చెయ్యగలిగేదీ లేదు. వ్యవస్థ మారేదాకా ఆ దుస్థితి తప్పదు.

గుడ్ మార్నింగ్. నీ ఉత్తరం అంది చాలా రోజులయినా, విశేషాల శేషాలు, వింతలు లేక జవాబు ఆగిపోయింది. మనసులో చెప్పవలసింది యింకేంలేక జవాబు వ్రాయలేదు.

ఈ ఉత్తరం కూడా అరగంట కిందట టీ తాగటాన్కి వెళ్ళక పోయుంటే రాయలేక నీకింకా బాకీ వుండి వుందును. ఆఫీసులో పని వొత్తిడివల్ల యివాళ యిప్పటికింకా బడలికగానే వుంది.

అందుకే హాయిగా నిద్దరపోదామని టీ తాగటానికి వెళ్ళేను. అక్కడ జరిగిన విషయం దానివల్ల నాలో చెలరేగిన భావాలు నీ ముందుంచు తున్నాను. దీనిని చదివి నువ్వేం చేసుకున్నా ఫరవాలేదు గానీ చదివినతర్వాత ఓ లిప్తపాటు కళ్ళు మూస్తే నేను, నా సంఘర్షణ ఫలవంత మైనట్టే. యిది నీకు తప్ప యింకోరికైతే తెలియ జెయ్యను. అప్పుడిది బడబాగ్ని అయ్యే ప్రమాదంవుంది. అవన్నీ యెందుగ్గానీ సంగతిది.

'ఇవ్వాళెవదిరా ఆట' - ఒక అబ్బాయి ప్రశ్న. "అదెవరో 'ఖారిగుధా' వాళ్ళదట- యింకో అబ్బాయి జవాబు. మొదటి అబ్బాయి.- 'బాబా ఈ గ్లాసు కడిగీపిదా' అన్నాడు నాయుడితో. అన్నట్లు చెప్పటం మరిచాను. రాత్రి టీ సేవన భాగ్యం కలిగించే ఈశాల్తీ పేరు నాయుడు. పూర్తి పేరేంటో నాకు తెలీదు. అడుగుదామని నాలిక దాకా మాట వచ్చినా. నవ్వేని నాయుడు ముఖం భయం కలిగించి. ఆ ప్రశ్నని అక్కడే ఆపేస్తుంది. 'ఉణ్ణీబే అని కరుకుగా నాయుడు ఆ అబ్బాయి ప్రశ్నకి జవాబు యిచ్చేడు. జవాబుని అలక్ష్యం చేసినందుకు నిదర్శనంగా ఆ అబ్బాయి 'కడిగిస్తున్నా బాబా' అని తీసుకుపోయి కడిగి తీసుకొచ్చాడు. ఆ గ్లాసు అక్కడుంచి "బాబా, బాబా" అని తల గోక్కుంటూ గొణిగేడు. "ఒరేయ్ ఆడుకుందాం రారా" అన్నాడు రెండో అబ్బాయి. "నేను రానెల్లు బే! నేన్నితోవస్తే బాబాకి గ్లాస్లెవడు కడుగుతాడురా. నేను రానెల్లు." అని మొదటి అబ్బాయి గసురుతూ చెప్పేడు. "గ్లాసులెందుకురా కడగడం. ఆడుకుందాం రా" అన్నాడు రెండోవాడు. ఆఖరుసారి సుమా అంటూన్నట్టు ఆ మాటలు వినిపించాయి మసక చీకట్లో. బడ్డీ నీడలో వారిద్దర్ని చూస్తుంటే యిద్దరికీ ఆకలి తాలూకు అర్థాలు యిప్పు[illegible] తెలీవనిపిస్తోంది. కళ్ళ కొపలు మెరుస్తూ కాంక్షలతో నాట్యం చేస్తూ నాక్కనిపించాయి. అందుకేనేమో ఆడాలి అంటాడొకడు. ఇంకోడు యింకెందుకో గునుస్తున్నాడు. ఇందాకట్నుంచీ బడ్డీకి ఆ వక్కగా వారున్నారు కాబట్టి సరిగ్గా చూడలేదుగానీ యిప్పుడిద్దరూ కనబడ్డారు. యిద్దరివి చిరుగుల మాసికల చొక్కాలే. అనాగరికత వెలుగుపక్కన ఉండే చీకట్లోనే అందంగా ఉంటుంది. వెలుగులో కొచ్చిందా వాస్తవం స్పృహ తెప్పిస్తుంది కదా!

మధ్యాహ్నం భోజనం హోటల్లో రద్దీగా ఉన్న సమయాన వీళ్ళు కుక్కలతో, కుస్తీపట్టడం నేనే కాదు, నాతోటి వాళ్ళందరం చూస్తూనే వుంటాం. అయితే యెందుకో ఆ సమయానికి అందరం దాన్ని మౌనంగానే గమనించి వూరుకుంటాం. పళ్ళదుకాణాల దగ్గరవాళ్ళు అరటిపళ్ళ తొక్కలు అవీ, యివీ తీయడం కూడా నేనెరుగుదును యిప్పుడు గుర్తుకు రావడంలేదుగానీ యిలాంటివే బస్సు దగ్గర, అడుక్కునే వారి దగ్గర యింకెన్నో. ఎన్నని జ్ఞాపకం చేసుకుని నీకు రాయను?

ఇప్పుడు గ్లాసు కడిగేసిదా, అని

### అమావాస్యం

త్యాగధనులు చిందించిన రక్తం
బొట్లు
ఘనీభవించిన కెంపులు —
శ్రమ జీవులు ఓడ్చిన ఘర్మజల
బిందువులు
గడ్డకట్టిన ముత్యాలు
వెల ఏ బేహారి కట్టగలడు?

— తెన్నేటి శ్యాం

నిల్చున్న ఆ అబ్బాయి మా వీధి మొదట్లో ఉదయం పడే ఆకులకట్టల పని పడుతూండటం నేను తెల్లవారి అయిదు గంటల బస్సుకెళుతూన్నప్పుడు వేసవికాలంలో ఒకటి రెండు సార్లు చూసినట్టు గుర్తు. ఇదేకాదు. "అమ్మా ....... ఓలమ్మా కొట్టకే" అని ఈ అబ్బాయి గోలెడ్తువుంటే ఓ ఆడమనిషి లాక్కుని వెళుతూంటే కూడా రెండు సార్లే చూసినట్టు గుర్తు. వాడ్ని ఈ ఆడమనిషి అమ్మవటానికికంది. కాని ఆ అధికారాన్ని కొట్టడానికే వుపయోగిస్తుందని నా కనిపిస్తోం దిప్పుడు. వాడి దగ్గర వుండే పైసల్ని గుంజుకోవటానికి ఈ అమానుష మనుకుంటాను. ఆవిడ ముఖం చూస్తే నీకూడా అదే అభిప్రాయం కలుగుతుందనటంలో నాకేం సందేహంలేదు. "వస్తావా రావా" అన్నాడు రెండోవాడు వెళ్ళిపోవటానికి సిద్ధమవుతూ ఆ తర్వాత. "నేను రానుబే" అన్నాడు మొదటి అబ్బాయి. నువ్వెళ్ళే వాడివి వెళ్ళరాదు అన్న ధీమాతో. తిండి, ఒళ్ళు గురించి వారికిద్దరికీ చింత లేదిప్పుడు. వాళ్ళకి బట్టలమీద శ్రద్ధ యెందుకు లేదు. అని ఆలోచించడం మన తప్పే అవుతుంది. అసలా ఆలోచన వారిద్దరికీ యింకో జీవితకాలందాకా రాదేమో! రేపటి గురించి ఆలోచించడానికి తీరికున్నట్టు నాకు మాత్రం అనిపించడంలేదు. ఆటగోల గురించి ఒకడు తీరికలేకుండా పరుగెత్తాడు. ఈ అబ్బాయి యింకేదో..........ఏదో ఆలోచిస్తూ నిలుచున్నాడు. ఆలోచనేదో బానిసను చేసి యిక్కడ నిలువుజీతం యిప్పిస్తోంది అనుకున్నాన్నేను. ఇంతసేపూ వచ్చినపని మరిచిపోయి మైకంలో నిలుచున్న నేను.


"ఏంటయ్యా. వేణ్ణీళయినా వేడిగా వున్నవి పొయ్యరాదూ!" అని నాయుడు మీద కేక వేస్తోంటే ఈ లోకంలో పడ్డాను. అయినా ఆ అబ్బాయిని చూస్తూనే ఉన్నాను నేను టీ చెప్పదాం అనుకుని, నాయుడేదో సణుగుతూ ముఖం జేవురించుకుని గిన్నె

కడగడానికి బయలుదేరుతుంటే ఊరు కున్నాను. ఆ అబ్బాయి వెంటనే గిన్నె తీసుకుని 'నే బాబా కడిగిసాను' అని నిలు చున్న పళంగానే ఒక్కడుగు వేసి కొళా యిని చేరుకున్నాడు. నిజం రాజూ, కనుల ముందు ఆ దృశ్యం యింకా కనబడుతూనే వుంది. వాడి పిలుపు నా చెవులనింకా సోకుతూనే వుంది. ఆ పలుకుల్లో కృత్రిమత్వంలేదు. నటనలేదు. విలువ కట్టలేని ఆప్యాయత. అనురాగం. కష్టం పంచుకోవాలనే తపన యివన్నీ నాకా పిలుపులో ధ్వనించాయి. శుభ్రంగా తోమి, గబగబా కడిగి తెచ్చాడు గిన్నె. నాయుడు ముఖం పనితనానికి ప్రసన్నం అయినా ప్రస్ఫుటించేందుకు యిబ్బంది పడుతూ గిన్నె అందుకున్నాడు.

నేను టీ యిమ్మన్నాను. నాయుడు పాలు గిన్నెలోపోసి పొయ్యిమీద పెట్టాడు. అబ్బాయి ఏదో గొణగడం మొదలు పెట్టాడు. ఆ గొణగడం మొత్తం యిది: "బాబా.... బాబా.... ఒక్క చుక్క. ఒక్క చుక్క టీ యివ్వు బాబా. తెల్లారి తిన్నది జీర్ణమవలేదు అందుకేమో. టీ సుక్క య్యవా!" యిది విన్న నాయుడు తారా జువ్వలాగా— "ఒరే నంజకొడకా. నాకు ముందే తెలుసులే. సువ్వూరికే ఈ యేషా లెయ్యవని. టీ లేదు. పీ లేదు ఎల్లెల్లు" అన్నాడు. అంటూనే మరుగుతూన్న పాల్లో టీగుండ పోశాడు. అబ్బాయి మాత్రం యే జంకులేకుండా "ఒక్క గుక్కెడు" యేణ్ణీలు బాబా! కడుపులో అదోకనాగుంది" అన్నాడు మళ్ళీ.

నాయుడు టీ దింపి నాకోగ్లాసు. యింకోళాలికోగ్లాసు యిచ్చాడు మిగిలింది ఇంకో గ్లాసులోపోసి ఆ అబ్బాయికిచ్చాడు. నాయుడిస్తాడని ఆ అబ్బాయికి తెలుసన్నేఉంది. అందుకే నాయుడు గసిరినా. కోప్పడినా వాడు బెదరకుండా అడిగేడు. ఆత్రంగా గ్లాసుని అందుకున్నాడా అబ్బాయి. చెయ్యి కాలిందేమో మరి ఆ చేతిలోంచి. ఆ చేతులోకి యిటు అటు రెండుసార్లు మార్చుకుని వాడి చిరుగులచొక్కాని మడతపెట్టుకుని రెండు చేతులతో పట్టుకుని మూతిదగ్గర పెట్టుకున్నాడు. కళ్ళు మూసుకుని హాయిగా గుటక వేసేడు.

నాయుడు ఏదో ఆలోచిస్తూ ఆ అబ్బాయిని చూస్తూ నిలుచున్నాడు. నా కన్నా ముందుగానే ఆ అబ్బాయి గ్లాసు ఖాళీచేసేడు దగ్గరలోనే పిల్లల గోల వినిపిస్తోంది రాత్రంతా పొద్దు పొడిచేవరకు అక్కడ ఈ రకం. ఆ రకం వాళ్ళంతా జూదం ఆడుతూనే ఉంటారు. పేక్కట్ట దొరికితే పేకాట. లేకపోతే గవ్వలు అవీ కాకపోతే యింకేదో. నాయుడు బడ్డీకి వంద గజాల



సేతుపతి ఆదినారాయణ

"College of B.A, B.Com Entrance
Correspondence Courses & Oral
Courses of study, Matric, Inter, B.A, B.Com.
Opp II Town Police Station, Visakhapatnam-20.

**Material Ready**

Those who complete 20 years are directly eligible for B.A B.Com, Entrance Courses without Minimum Qualification
Prospectus by M O 3-50 Tution fee Rs 200/-

*First Batch oral Classes Admissions are already started*"



శుభవార్త
నాడీ ప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు
**డాII ఎస్. ఎస్. రావు, M. B. H, R. M. P.**
గారిని సంప్రదించండి.

**రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,**
ప్లాట్ నెం. 471. జూబ్లిహిల్సు కో-ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్సు. బంజారాహిల్సు ఎక్స్టెన్షన్.
హైదరాబాద్-500 034 (నాంపల్లి నుండి బస్సు రూట్ 185)

శరీర బలహీనత. పొడుగా పెరుగుటగాని. చిన్నప్పటినుండి ఏ మందువలన లావుకాకపోవుట. అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట. నరముల బలహీనత. మానసిక వ్యాధులు. ఫిట్సు. భయం. గుండెదడ. రక్తప్రసరణ ఎక్కువగావడం లేక తక్కువ గావడం. సర్వవిధములగు దగ్గులు. ఉబ్బసం. పొత్తికడుపు ఎత్తుగాపెరగడం. జలోదరం. కడుపునొప్పి. గ్యాస్టిక్ ట్రబుల్స్. లివర్ జబ్బులు. కడుపులో గాలిచేరుట. స్త్రీల ముట్టుకట్టునొప్పి. కసుమవ్యాధి(ఏ రంగైనాసరే). మూత్రవ్యాధులు. మూలశంకు. సుఖవ్యాధులు. స్త్రీలకుగాని. పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత. పిల్లలు లేకపోవుట. వీపునొప్పి. నడుమునొప్పి. కీళ్ళవ్యాధులు. వాపు. నీరుచేరుట. చర్మవ్యాధులు. పుండ్లు. ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట. బోదవాపు. జ్వరం. పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినపుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలం : ఉ. 7 గం నుండి సా. 5 గం. వరకు
పరీక్ష ఫీజు రు. 15/- చికిత్సకు అదనం.

ప్రతినెల క్యాంపులు : 5వ తేదీ కర్నూలు— న్యూ ఉడిపి హోటల్. పెద్ద మార్కెట్ వద్ద; 6వ తేదీ గుంతకల్— శ్రీలాడ్జి; 7వ తేదీ కడప— ద్వారకాలాడ్జి; 8వ తేదీ తిరుపతి—భీమాస్అనెక్స్లాడ్జి; 9.10 తేదీలు మద్రాస్—కోమలవిలాస్. నెం 5 ఫ్రాన్స్ జోసఫ్ స్ట్రీట్ (జి.టి.); 11వ తేదీ నెల్లూరు—రాఘవ విహార్; 12వ తేదీ గుంటూరు—ఉడిపిశ్రీకృష్ణభవన్. స్టేషన్‌రోడ్. 13.14 తేదీలు రాజమండ్రి— శాంతినివాస్ (మెయిన్‌రోడ్); 15.16 తేదీలలో వైజాగ్—బృందావన్‌లాడ్జి; 17వ తేదీ విజయవాడ—మోడరన్ కేఫ్ లాడ్జి (గాంధీనగర్); 18వ తేదీ ఖమ్మం — మయూర్ కేఫ్ (శేషమహల్‌లాడ్జి); 19వ తేదీ వరంగల్—హోటల్‌వటరాజ. 20వ తేదీనుండి హెడ్డాఫీస్.

SWASTIK

దూరంలో ఆ లైటు స్తంభం కింద మాత్రం ఆట. సుంగ, ఉండి ఉడిగి గోలితిట్లు ఈ ఊరో నిశీధికో అలంకారం. నాయుడి బడ్డీ ఓ అలంకారమైతే యిది యింకో ఆభరణం. యిప్పుడు అక్కడ గోల కాస్త ఎక్కువయింది. ఈ అబ్బాయి ఖాళీగ్లాసు డబ్బునపెట్టి పరుగు లంకించుకున్నాడు. "ఒరే దొంగనాకొడకా గ్లాసెవడు బే కడుగుతాడు" అన్న నాయుడు కేక గాలిలోనే కలిసిపోతుంటే ఒక్కటే పరుగు దీవం వేపు.

'నాయుడూ, నువ్వెందుకు టీ యిచ్చావ్' అని అడిగాను.

"వాడడుగుతాడు సరిగా ఆ సమయానికే యింత మిగులుతుంది. యిది రోజూ సంతే. అందుకే ఆడికిస్తాను" అని నాయుడు జవాబిచ్చాడు. నాయుడిలో చిత్రమైన గుణం వుంది. ఫలానావారికి అని సంబోధించకుండా మాట్లాడతాడు. నేను కూడా నాయుడి దగ్గరకెళ్ళిన మొదట్లో సరదాకొద్దీ అలాగే మాట్లాడేను. కొన్నాళ్ళే. కానీ అదే కొనసాగించటం నా చేత కాలేదు. అందుకే యిప్పుడు "నాయుడూ" అని సంబోధించే మాట్లాడుతాను. నాయుడి గురించి రాస్తూ, నాయుడి మాటలు మరిచిపోతాను. అంతటితో నాయుడు ఆగలేదు. "చిన్నప్పుడు నేను ఈడిలాగే వుండేవాడ్ని. అయితే యిలాంటి దొంగముండా పనులెప్పుడు చెయ్యలేదు. ఈనా కొడుక్కి చూడు. సిగ్గులేదు. శరం లేదు. నేను చిన్నప్పుడు చదువుకోవాలను కోలేదుగానీ దర్జాగా బతకాలి అనుకునే వాడిని. అదెల్లా అని సతమతమయిపోయినప్పుడు. నాలోనుంచి యెవరో "అల్లా చందూబాబుని చూడు" అంటూ ఓ మేడని చూపించేడు. "అయినా ఈడ్నని ఏటి నాభంలే. ఆ డబ్బుని. ఆడబ్బ పెళ్ళాన్ని అనాలి. కనగానే సరిపోయిందా సంత" అంటూ నేనిచ్చిన డబ్బులు పుచ్చుకున్నాడు. నేనింకా నిలుచుంటే నాయుడింకా ఏదో చెప్తాడు గానీ, వినే వోపిక నాకులేదు. యిన్ని చెప్పే నాయుడు ఆ అబ్బాయికి టీ యెందుకివ్వాలి అన్న ప్రశ్న నన్ను నాయుడి మాటలు వినడానికి విముఖుడ్ని చేశాయి.

దారంతా ఈ అబ్బాయి గురించిన ఆలోచనలే నన్ను అలుముకున్నాయి. ఈ ఒక్క రోజేగాక వీడిని అప్పుడప్పుడు చూస్తూంటాను అని నీకు ముందే చెప్పాను కదా!

మెదడులో యిన్ని ఛాయా చిత్రాలు కలిసి ఏవో రూపాన్ని దిద్దుకుని వ్యాఖ్యానాన్ని చెయ్యడం మొదలెట్టింది.

ఈ భావి పౌరుడికి రేపు గురించి చింత లేదు. జరిగింది చూసుకునే తీరిక, జ్ఞానము వున్నాయా! ఉన్నాయనే అనుకోవాలి. లేదు అంటే ఆశ వెనుక ఆశ. కోరిక తరువాత కోరిక లేకుండా వాడి రోజు గడవదే! వీడు బాల్యంలోనే యిలా వుంటే యింకా ముందున్న జీవితం మాటేమిటి? ఈ ప్రశ్న నీ, నా లాంటి వాళ్ళలో వుదయిస్తే ఏం చెయ్యగలం? వాళ్ళ అమ్మ నాన్నల్లో ఉదయిస్తేనో.... యేమో చెప్పలేనుగానీ ఈ ప్రశ్న నేటి బాలలే రేపటి పౌరులు అనే వారికి వినిపించదు. వారికీ దృశ్యాలు కనిపించవు. అందుకే ప్రజల్లోకి వారు కట్టుబాట్లతో వస్తారు. వారి జీవితం, విధానమే వేరు. వారంతా నినాదాలు, నిదానాల గురించి మాటలాడటమే వారి జీవితాల్లో ప్రధానాంశం.

ఈ అబ్బాయికీ తెల్లవారి వీధిలో దెబ్బలాడుకునే ఆవులకి, కుక్కలకి ఏంటీ తేడా! అవి అరుస్తే వీడు తిడతాడు.

అవి జంతువులు. వీడు స్వేచ్ఛా స్వతంత్ర వాయువులు పీల్చుకుని, కోర్కెలుతీరే మార్గాలు వెతుక్కునే భావి పౌరుడు, నేటి బాలుడు. సరైన మార్గంలో అడుగులు వేయించాల్సిన వీడమ్మ, వీడికి ఎవడిపొట్టని వాడే నింపుకోవాలి, ఎలాగైనా సరే అవసరమైనప్పుడు అమ్మకి డబ్బులివ్వాలి. లేకపోతే పోగువేసివ్వాలి, అని నిర్దేశిస్తుందా? లేకపోతే రోడ్డు మీద ఎద్దుని బాదినటు బాదడమెందుకు చెప్పు? అప్పుడప్పుడు. వాడయ్యనేవాడు అసలొకడుంటే తిండితర్వాత సుఖం ఎలాగో చెపుతాడు తప్ప యింకేం ఉద్ధరించడు అని ఈ అబ్బాయిని చూసిన నాకనిపిస్తోంది.

రాత్రిళ్ళు జరిగే కొట్లాటలు, మనకు కనిపించనివెన్నో యిలాంటి సంఘటనలు. యివన్నీ చూస్తూ, వింటూ వింటే ఈ ప్రదేశంలో చాలామంది భావి పౌరుల జీవితం యిదే అనిపిస్తోంది. అదుపులేదు, ఆజ్ఞలేదు, భయం, భక్తి, అసలులేవు. పుట్టిన వాడు బతకడానికే అనే సూత్రంమీదే అనిపిస్తోందికదూ! భావి పౌరులయిన బాలలూ ఈ దేశంలో యిప్పుడిలా వున్నప్పుడు ఈ దేశాన్ని యేదో చేయిస్తామని, చేసేస్తున్నాం అనేవారిని యేం చెయ్యాలి? నాకు నా మీద అసహ్యం కలుగుతోంది.

ఎందుకో తెలుసా! నీకు, నాకు యిందులో భాగంలేమా? యేమన్నా చేద్దామన్నా పరిస్థితులు కూడా కలిసిరావడం లేదు. అసలు నేను ఈ దేశపౌరున్ని అని చెప్పుకునేందుకు సిగ్గువేస్తోంది. అయినా బతుకుతున్నాను, బతుకుతాను. ఇలాగే, ఏంటో యింకో కోణంలో నుంచి ఆలోచిస్తూ ఉంటే ఈ అసహ్యం, అశక్తత, ఈ వైరుధ్యాల రాజీ, సమన్వయం ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ విషయం నన్నెంత దహించిందంటే.... నీకు ఈ విధంగా తెలియచేసే వరకు నిద్దరపట్టక చిరాగ్గా వుండేది. పని బడలికతో పాటు ఈ అశాంతి. నా మనస్సులోని ఈ ఆవేదనని యింకొకరికి తెలియచేశాను. అనే పూరటవల్ల కాబోలు కళ్ళు మూతలు పడ్తున్నాయి. ఆవలింతలు వస్తున్నాయి. ఠాణాలో రెండుగంట లిప్పుడే కొట్టారు, నీ ఉత్తరంకోసం, నీ ఆలోచన కోసం యెదురు. గుడ్ నైట్.

నీ మిత్రుడు

డొళాయి.

★



